క్లుప్తంగా

ఆర్థిక సాయం అందజేత



పెనమలూరు: పోరంకి సాలిపేటలో ఇటీవల మృతిచెందిన వైఎస్సార్ సీపీ సానుభూతిపరుడి కుటుంబ సభ్యులకు ఆ పార్టీ శుక్రవారం ఆర్థిక సాయం అందించింది. గ్రామానికి చెందిన కలింగపట్నం బలరామ్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. అతని కుటుంబ సభ్యులకు వైఎస్సార్ సీపీ పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి రూ. 10 వేలు ఆర్థిక సాయం ఇవ్వగా ఆ సొమ్మును బాధిత కుటుంబ సభ్యులకు తాడిగడప మున్సిపాలిటీ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వేమూరి బాలకృష్ణ, పార్టీ రాష్ట్ర నాయకుడు పి.రాఘవరావు సొమ్ము అందజేశారు. నేతలు మొక్కా దిలీప్, కే ఉపేంద్ర, వీరవల్లి పవన్, సాయి, అశోక్ పాల్గొన్నారు.

ఘనంగా శాకంబరి ఉత్సవాలు



పెనమలూరు: కానూరు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీగోపయ్య సమేత శ్రీతిరుపతమ్మతల్లి అమ్మవారి ఆలయంలో శుక్రవారం శాకంబరి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఆలయంలో అమ్మవారిని ఉదయం ఆలయ కమిటీ, భక్తులు కలిసి వివిధ రకాల కూరగాయలు, పండ్లతో శాకంబరిగా అలంకరించారు. భక్తులు ఆలయంలో అమ్మవారిని దర్శించుకొని పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

గన్నవరంలో 1కే ర్యాలీ



గన్నవరం: మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం మీడియేషన్ ఫర్ ద నేషన్ కార్యక్రమంలో భాగంగా 1కే ర్యాలీ నిర్వహించారు. స్థానిక కోర్టుల ప్రాంగణం నుంచి అంబేడ్కర్ బొమ్మ సెంటర్ వరకు ప్రదర్శన కొనసాగింది. ఈ సందర్భంగా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, సబ్‌కోర్టు జడ్జి డాక్టర్ ఎస్. అరుణశ్రీ మాట్లాడుతూ మధ్యవర్తిత్వం ద్వారా కేసుల పరిష్కారమే ఉత్తమమైన మార్గమన్నారు. మధ్యవర్తిత్వంపై దేశ వ్యాప్తంగా జరుగుతున్న ప్రచారంలో భాగంగా 1కే ర్యాలీ నిర్వహించినట్లు తెలిపారు. జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ఎస్. గాయత్రి, పలువురు న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

శాస్త్రీయ సంగీత వైభవాన్ని చాటిన కచేరి



విజయవాడ కల్చరల్: సామగాన లహరి కల్చరల్ ట్రస్ట్, కంచి కామకోటి పీఠస్థ శారదా చంద్రమౌళీశ్వర స్వామి దేవస్థానం సౌజన్యంతో సంగీత వాగ్గేయకారుడు మల్లాది సూరిబాబు 80 జన్మదిన వేడుకల సందర్భంగా లబ్బీపేట శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న శాస్త్రీయ సంగీత కచేరీలు సంగీత వైభవాన్ని చాటుతున్నాయి. శుక్రవారం నాటి కార్యక్రమంలో చెన్నైకి చెందిన యువ సంగీత కళాకారుడు ధూళిపాళ్ల సాయి దీక్షిత్ రెండు గంటల పాటు వాగ్గేయకార కీర్తనలను అలవోకగా ఆలపించారు. శివనంద యశస్వి మృదంగంపై శ్రీరంజనీ వైష్ణవీ వాద్య సహకారం అందించారు. నిర్వాహకుడు మల్లాది సూరిబాబు మాట్లాడుతూ శనివారం నాటి కార్యక్రమాలు ఉదయం 10 గంటలకు ప్రారంభమై రాత్రి 10 గంటల వరకు సాగుతాయని తెలిపారు. దేవాలయ కార్యనిర్వాహకుడు డాక్టర్ రామ్మోహనరావు పాల్గొన్నారు.

ముగిసిన గురుపౌర్ణిమ వేడుకలు



భవానీపురం(విజయవాడపశ్చిమ): స్థానిక హౌసింగ్‌బోర్డ్ కాలనీలోని సంకల్ప సిద్ధి శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో మూడు రోజుల పాటు నిర్వహించిన గురుపౌర్ణిమ పర్వదిన వేడుకలు నాలుగవ రోజు శుక్రవారంతో ముగిశాయి. సాయిబాబాకు పుష్పాలతో సహస్ర నామార్చాన జరిగింది. అనంతరం 72 గంటలపాటు నిరంతరంగా సాగిన 'ఓం సాయి శ్రీసాయి జయజయ సాయి' అఖండ సాయినామ సంకీర్తన ముగింపుతో గురుపౌర్ణిమ వేడుకలు ముగిశాయని మందిరం పాలకవర్గం అధ్యక్షుడు బూర్లె వెంకటేశ్వరరావు తెలిపారు. ఉత్సవాల నిర్వహణకు సహకరించిన పాలకవర్గ సభ్యులు, దాతలు, విశేషంగా పాల్గొన్న భక్తులకు ధన్యవాదాలు తెలియజేశారు. ముగింపు వేడుకల్లో పాలకవర్గం ఉపాధ్యక్షుడు మోటుమర్రి సుబ్బారావు, వెంకట రమేష్, కోశాధికారి చందలూరి రాజశేఖర్, సంయుక్త కార్యదర్శి పెండేల వెంకట లక్ష్మీప్రసాద్, సహాయ కార్యదర్శి గుడివాడ విజయ్‌కుమార్, సభ్యులు పాల్గొన్నారు.

నీరుగారిన నిర్వహణ

- శిథిలమైన వాటర్ ట్యాంకులు
- తుప్పు పట్టిన వాటర్ పైపులు
- అపరిశుభ్ర నీరు వస్తున్నాయని గ్రామస్తుల ఆవేదన



వినాయకుడి ఆలయం సమీపంలో పాచిపట్టి అధ్వానంగా ఉన్న వాటర్ ట్యాంక్



సిమెంట్ పెచ్చులు ఊడి బయటపడిన ఇనుప చువ్వలు

రామవరప్పాడు: విజయవాడ రూరల్‌మండలం నిడమానూరులోని వాటర్ ట్యాంకు పర్యవేక్షణ, పరిశుభ్రత లోపించడంతో గ్రామస్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామంలో మొత్తం నాలుగు ట్యాంకులు ఉన్నప్పటికీ సరైన నిర్వహణ లేకపోవడంతో అపరిశుభ్ర నీరు వస్తున్నాయని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దళితవాడలో 60వేల లీటర్ల సామర్థ్యం, రామానగర్‌లో 40వేలు, హైస్కూల్ వద్ద 2లక్షల లీటర్లు, వినాయకుడి ఆలయం వద్ద 20వేల లీటర్ల సామర్థ్యం గల ట్యాంకులు ఉన్నాయి. నిత్యం రెండు పూటల తాగునీరు సరఫరా చేస్తున్నప్పటికి తాగడానికి పనికి రావడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. ఒక్కోసారి రంగు మారి నలకలతో కూడిన నీరు వస్తున్నాయని, మరొకసారి ఉప్పుగా ఉంటున్నాయని ఆవేదన చెందుతున్నారు. కలుషిత నీరు తాగడం వల్ల అనారోగ్యాల బారిన పడుతున్నామని ఆవేదన చెందుతున్నారు.

పట్టించుకోని అధికారులు

గ్రామంలోని ట్యాంకులను శుభ్రపరిచి నెలలు దాటుతున్నాయని గ్రామస్తులు చెబుతున్నారు. ప్రతి నెలా ట్యాంకులను శుభ్రపరచాల్సి ఉండగా పంచాయతీ అధికారులకు పట్టడం లేదని చెబుతున్నారు. కనీసం క్లోరినేషన్ కూడా చేయడం లేదు. వినాయకుని ఆలయం సమీపంలోని వాటర్ ట్యాంక్ పాచిపట్టి అధ్వాన స్థితికి చేరుకుంది. ట్యాంకు కింది భాగంలో ఫిల్లర్ల సిమెంట్ పెచ్చులు ఊడి ఇనుప చువ్వలు దర్శనమిస్తున్నాయి. ట్యాంకుకు అనుసంధానం చేసిన ఇనుప పైపులు తుప్పు పట్టి లీక్ అవుతున్నాయి. ఈ ట్యాంకు అధ్వాన స్థితికి చేరుకున్న కనీసం మరమ్మతులు కూడా నిర్వహించడం లేదు. రామానగర్, కాల్వగట్టు ప్రాంతాల్లో సరఫరా అయ్యే నీరు తాగేందుకు పనికి రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మినరల్ వాటరే ఆధారం

భారమని తెలిసిన మినరల్ వాటర్ క్యాన్‌లపైనే ఆధార పడుతున్నామని గ్రామస్తులు చెబుతున్నారు. గ్రామంలో పేద, మధ్య తరగతి కుటుంబాలు ఎక్కువగా నివసిస్తున్నారు. వీరంతా కూలీ పనులకు, పొలం పనులకు వెళ్లేవారి సంఖ్య ఎక్కువగా ఉంటుంది. అసలే నిత్యావసర ధరలు పెరిగిపోతున్నాయని దీనికి తోడు కూలీ డబ్బుల్లోనే తాగునీరును కూడా నిత్యం కొనుగోలు చేయాల్సి వస్తోందని ఆవేదన చెందుతున్నారు. వేసవితో పాటు వర్షాకాలంలో కూడా తాగునీరు కోసం ఇబ్బందులు పడాల్సి వస్తోందని చెబుతున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి వాటర్ ట్యాంక్‌లను శుభ్రపరచాలని, అసంపూర్తిగా నిలిచిపోయిన వాటర్ పైపులైన్ విస్తరణ పనులు పూర్తి చేసి సురక్షిత తాగునీటిని అందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సమస్యలు వాస్తవమే

గ్రామంలో వాటర్ ట్యాంకులను శుభ్రపరిచి సురక్షిత తాగునీరు అందేలా చర్యలు తీసుకుంటున్నాం. నెహ్రూనగర్‌లో వాటర్ పైపులైన్ విస్తరణలో పలు సమస్యలు ఉన్న మాట వాస్తవమే. సుమారు రూ. 10లక్షల వ్యయంతో వాటర్ పైపులైన్‌ను సరి చేయాలని ప్రణాళికలు రూపొందిస్తున్నాం. పంచాయతీ సమావేశంలో తీర్మానం చేసి పైపులైన్ పనులు పూర్తి చేస్తాం.

– ఎన్. నరసింహారావు, పంచాయతీ కార్యదర్శి

అస్తవ్యస్తంగా వాటర్ పైపులైన్



కనెక్షన్లు ఇవ్వకపోవడంతో తుప్పు పట్టిన వాటర్ పైపులు

జలజీవన్‌మిషన్ నిధులతో గ్రామంలోని రామానగర్, నెహ్రూ నగర్‌లో చేపట్టిన వాటర్ పైపులైన్ విస్తరణ పనులు అస్తవ్యస్తంగా నిర్వహించడంతో నిధులు వృధా అయ్యాయని పలువురు విమర్శిస్తున్నారు. జలజీవన్ మిషన్ ద్వారా గ్రామంలో తాగునీటి అవసరాల కోసం సుమారు రూ. 3కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఈ నిధుల నుంచి సుమారు రూ. 2కోట్లతో గ్రామంలోని రామానగర్, నెహ్రూ నగర్‌లో వాటర్ పైపులైన్ విస్తరణ పనులు నిర్వహించారు. బాధ్యతారాహిత్యం, అవగాహన లోపంతో డ్రెయిన్ సరిహద్దు, నివాసాల ప్రహరీల పక్క నుంచి వేయాల్సిన పైపులైన్ డ్రెయిన్ మీదుగా వేసి చేతులు దులుపుకొన్నారు. పైగా ఈ పనుల్లో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల అలసత్వం, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా నాణ్యతా ప్రమాణాలు లోపించాయి. ఫలితంగా జాయింట్లు లీక్ అవ్వడం, తుప్పు పట్టి లివర్లు విరిగిపోవడం జరుగుతున్నాయి. ఈ ప్రాంతంలో పలుచోట్ల పైపులైన్ కనెక్షన్లు కూడా ఇవ్వకపోవడం గమనార్హం.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెనమలూరు: పోరంకి సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం ఎనిమిది నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ ఆపరేషన్స్ పి.హరిబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోరంకిలో సాలిపేట, పెనమలూరు సెంటర్, రామాపురంకాలనీ, డొంకరోడ్డు, బందరురోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు.

కానూరులో..

కానూరు గ్రామంలో పెద్దబావి సెంటర్, యాదవుల బజార్, రంగా బొమ్మ సెంటర్, వృద్ధుల ఆశ్రమం రో డ్డు, కెనడీ స్కూల్, కామయ్యతోపు, జేఏఆర్‌డీ ఎస్టేట్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు, ప్రసాదంపాడులోని పలు ప్రాంతాల్లో శనివారం ఉదయం 8.30 నుంచి 10.30 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ ఏఈ పరమేశ్వరరావు తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతులు, నూతన స్తంభాల ఏర్పాటు నిమిత్తం ప్రసాదంపాడులోని యాదవుల బజారు, ఎస్సీ కాలనీ రామవరప్పాడులో రాజుల బజారు, హనుమాన్‌నగర్ ఏరియాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఉంగుటూరు(గన్నవరం): ఉంగుటూరు సబ్‌స్టేషన్ మరమ్మతుల నిమిత్తం శనివారం ఉదయం ఎనిమిది నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు గుడివాడ ఈఈ బి.జి. శ్రీనివాసరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉంగుటూరు సెక్షన్ పరిధిలోని ఇందుపల్లి, వేమండ, నందమూరు, మానికొండ, చాగంటిపాడు, చికినాల, బొకినాల, మ దిరిపాడు గ్రామాల్లో విద్యుత్ ఉండదని పేర్కొన్నారు. అదేవిధంగా ఆత్కూరు సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

కంకిపాడు: మండలంలోని ఈడుపుగల్లు, కోలవెన్ను గ్రామాల్లోని 33/11 కేవీ సబ్‌స్టేషన్‌ల మరమ్మతుల కారణంగా కోలవెన్ను, కుందేరు, కోమటిగుంట లాకు, ఈడుపుగల్లు గ్రామాల్లో ఉదయం ఎనిమిది నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఈఈ పి.హరిబాబు తెలిపారు.

దుర్గగుడిలో అంతర్గత బదిలీలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వారి దేవస్థానంలో వివిధ విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బందితో పాటు ఎన్ఎంఆర్, అవుట్‌సోర్సింగ్ సిబ్బందిని అంతర్గత బదిలీలు చేస్తూ ఈఓ శీనానాయక్ శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. బదిలీలలో ప్రధాన ఆలయంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బందిని, దర్శన టికెట్లు, ప్రసాదాల విక్రయ కౌంటర్లు, ఆర్జిత సేవా టికెట్ల కౌంటర్లు, స్కానింగ్ పాయింట్‌తో పాటు మల్లేశ్వర స్వామి వారి ఆలయం, ఉపాలయాల వద్ద విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి సైతం బదిలీలు అయ్యాయి.

పలు పీఏసీఎస్‌లకు పాలకవర్గాల నియామకం

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలంలోని పలు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు రాష్ట్ర ప్రభుత్వం ముగ్గురు సభ్యులతో కూడిన పాలకవర్గాలను ప్రకటించింది. మండల కేంద్రమైన బాపులపాడు పీఏసీఎస్‌కు వడ్డి శివ నాగేశ్వరరావు చైర్మన్‌గా, గుళ్లపూడి ప్రసాద్, చెన్నుబోయిన రామారావులను సభ్యులుగా నియమించారు. బిళ్లనపల్లి పీఏసీఎస్ చైర్మన్‌గా బెజవాడ వాసు, సభ్యులుగా జుజ్జువరపు వెంకట శ్రీనివాసరావు, రాజులపాటి సీతారామయ్య నియమితులయ్యారు. కాకులపాడు పీఏసీఎస్ చైర్మన్‌గా యజ్జవరపు శ్రీనివాసరావు, సభ్యులుగా జక్కా శ్రీనివాసరావు, కొల్లిపర కిషోర్ నియమించబడ్డారు. కానుమోలు పీఏసీఎస్ చైర్మన్‌గా దన్నె దుర్గారావు, సభ్యులుగా అచ్చెన వెంకటేశ్వరరావు, చిట్టూరి ఏడుకొండలు, కొత్తపల్లి పీఏసీఎస్ చైర్మన్‌గా వడ్డి అశోక్‌కుమార్, సభ్యులుగా వంగల వెంకటేశ్వరరావు, షేక్ బడే సాహెబ్, కొయ్యూరు పీఏసీఎస్ చైర్మన్‌గా టీడీపీకి చెందిన కొల్లి వెంకట లక్ష్మీనారాయణ, సభ్యులుగా పల్లగాని సుబ్బారావు, సిలారపు మరియమ్మ నియమితులయ్యారు. మల్లవల్లి పీఏసీఎస్ చైర్మన్‌గా జాన్ బాషా, సభ్యులుగా ఆరేపల్లి వెంకటేశ్వరరావు, చిన్నాల నరసింహారావు, రంగన్నగూడెం పీఏసీఎస్ చైర్మన్‌గా కనకవల్లి శేషగిరిరావు, సభ్యులుగా సుముద్రాల వరప్రసాద్, గండి శ్రీనివాసరావు, వీరవల్లి పీఏసీఎస్ చైర్మన్‌గా కలపాల నాగ వెంకట శివప్రసాద్, బొద్దుపాటి నాగరాజు, చెన్నకేశవులు, వేలేరు పీఏసీఎస్ చైర్మన్‌గా ఆవిర్నేని భవానీశంకర్, సభ్యులుగా వీరవల్లి రంగారావు, తిరుపీధి మరియదాసు నియమించబడ్డారు.

వక్ఫ్ భూమిలో ఈద్గా - షాదీఖానా పనులు



తాడిగడప వక్ఫ్ భూముల్లో జరుగుతున్న మెరక పనులు

పెనమలూరు: తాడిగడప గ్రామంలోని కొండపల్లి ఖాజీ పరిధిలో ఉన్న వక్ఫ్ భూముల్లో షాదీఖానా, ఈద్గా పనులు ప్రారంభించారు. తాడిగడప, పెదపులిపాక గ్రామాల్లో వక్ఫ్ భూమి దాదాపు 41 ఎకరాలకు పైగా ఉంది. ఇందులో ఇటీవలే 39 ఎకరాలకు కౌలు వేలంపాట నిర్వహించారు. అయితే తాడిగడప పరిధిలో ఆర్ఎ నెంబర్ 79లో రెండు ఎకరాల భూమిని ఈద్గా, షాదీఖానాకు కొండపల్లి ఖాజీ ఎండీ అబీబుల్లా హుస్సేన్ అంగీకారం తెలుపుతూ తహసీల్దార్‌కు లెటర్ ఇచ్చారు. ఈద్గా, షాదీఖానా నిర్మాణానికి దాదాపు రూ. 2 కోట్లకు పైగా నిధులు ప్రభుత్వం ఇవ్వాలని స్థానిక ఎమ్మెల్యే ప్రసాద్‌కు వక్ఫ్ అధికారులు, కొండపల్లి ఖాజీ విన్నవించారు. ఈద్గా, షాదీఖానా నిర్మాణం చేస్తే తాడిగడప, పోరంకి, కానూరు, తదితర గ్రామాలోని ముస్లింలకు ఉపయోగపడుతుందని అధికారులు తెలిపారు. దీంతో ప్రస్తుతానికి రెండు ఎకరాల పొలంలో మెరక పనులు ప్రారంభించారు.

వక్ఫ్ భూములు ఆక్రమించిన వ్యక్తిపై ఫిర్యాదు

ఇది ఇలా ఉండగా పెదపులిపాక గ్రామంలో 12 ఎకరాలకు పైగా ఉన్న వక్ఫ్ భూముల్లోకి ఓ వ్యక్తి ప్రవేశించి సాగు చేపట్టడంపై వక్ఫ్ అధికారులు శుక్రవారం జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశారు. కౌలు వేలంపాట జరిగి కోర్టు తుది ఉత్తర్వుల కోసం ఎదురు చూస్తున్న సమయంలో ఆక్రమణలకు దిగారని వక్ఫ్ అధికారులు పోలీసులకు, జిల్లా రెవిన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

ప్రజా సేవతోనే గుర్తింపు



వ్యవసాయ సహాయకులను సత్కరించిన రైతులు

నున్న(విజయవాడరూరల్): ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగులు ప్రజలకు అందించిన సేవలే గుర్తింపు తెస్తాయని మాజీ ఎంపీపీ, వైఎస్సార్ సీపీ నాయకుడు యర్కారెడ్డి నాగిరెడ్డి పేర్కొన్నారు. నున్న గ్రామం నుంచి బదిలీపై వెళుతున్న వ్యవసాయ సహాయకులు మౌనిక, బిందులను శుక్రవారం గ్రామ రైతులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నాగిరెడ్డి మాట్లాడుతూ గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో గ్రామ సచివాలయాల్లో నియమించబడిన వ్యవసాయ సహాయకులు రైతులకు మంచి సేవలు అందించారని కొనియాడారు. బదిలీపై వెళ్లిన గ్రామాల్లో కూడా రైతులకు సేవలందించి మంచి గుర్తింపు తెచ్చుకోవాలని గ్రామ సర్పంచి కాటూరి సరళ శ్రీనివాస్ సూచించారు. కార్యక్రమంలో ఉప సర్పంచి కలకోటి బ్రహ్మానందరెడ్డి, పంచాయతీ కార్యదర్శి కోట సురేష్‌బాబు, సొసైటీ మాజీ ఛైర్మన్ పోలారెడ్డి చంద్రారెడ్డి, మాజీ భీమవరపు ముత్తారెడ్డి, టీడీపీ గ్రామ అధ్యక్షుడు కలకోటి శ్రీనివాసరెడ్డి, యర్కారెడ్డి కోటిరెడ్డి, యర్కారెడ్డి మల్లారెడ్డి, గుంటక చినవెంకటరెడ్డి, దండు సుబ్రహ్మణ్యం రాజు తదితరులు పాల్గొన్నారు.

సీతాదేవి అమ్మవారికి ఆషాఢ సారె



అమ్మవారికి సమర్పించేందుకు ఆషాఢ సారెను తీసుకువచ్చిన భక్తులు

బుద్ధవరం(గన్నవరం): మండలంలోని బుద్ధవరంలో వేంచేసియున్న శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో శుక్రవారం అమ్మవారికి ఆషాఢ సారెను భక్తులు సమర్పించారు. తొలుత శ్రీఅభయాంజనేయస్వామి, శ్రీసీతారామచంద్రస్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పెద్ద సంఖ్యలో మహిళలు ఊరేగింపుగా బయలుదేరి గ్రామ దేవతలైన గంగనమ్మ, మహాలక్ష్మీదేవికి ఆషాఢ సారెను సమర్పించారు. అక్కడి నుంచి ప్రదర్శనగా ఆలయానికి చేరుకున్న భక్తులు శ్రీసీతాదేవికి పసుపు, కుంకుమ, గాజులు, పలు రకాల నైవేద్యాలు, పట్టు వస్త్రాలతో కూడిన సారెను సమర్పించారు. ఈ సందర్భంగా అమ్మవారికి నక్క రంగారావు, నిర్మల కుమారి దంపతులు ప్రత్యేక లోహలతో తయారు చేసిన పాదుకలను కానుకగా సమర్పించారు. ఆలయ కమిటీ ఛైర్మన్ నక్క రామారావు, అధ్యక్షుడు గండికోట నాంచారయ్య, సభ్యులు తాడిశెట్టి శ్రీనివాసరావు, గండికోట గోవర్ధనరావు, నక్క కొండలస్వామి, రంగారావు, వెంకట్రామయ్య తదితరులు పాల్గొన్నారు.

సమస్యల వలయంలో సరస్వతీ నిలయం

- కంకిపాడు జెడ్పీ హైస్కూల్‌లో అధ్వానంగా మరుగుదొడ్లు
- మరమ్మతులకు నోచుకోని ఆర్ఓ ప్లాంటు
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు



కంకిపాడు జెడ్పీ హైస్కూల్

కంకిపాడు: వందలాది మంది విద్యార్థులు విద్యనభ్యసించే సరస్వతీ నిలయం సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతోంది. విద్యాలయంలో అరకొర వసతులు నెలకొనడంతో ఇబ్బందులు పడుతూ చదువులు కొనసాగిస్తున్నారు. పేరెంట్స్ మీట్‌లో స్వయంగా విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల సమస్యలపై ఎమ్మెల్యే ఎదుట మొరపెట్టుకున్నారు.

మండల కేంద్రమైన కంకిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 430 మందికి పైగా విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రెండో దశ మన బడి నాడు – నేడు పనుల్లో భాగంగా పాఠశాలకు అవసరమైన తరగతి గదుల నిర్మాణం చేపట్టారు. అయితే ఎన్నికలు రావడంతో పనులు తుదిదశలో మిగిలిపోయాయి. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం తుదిదశ పనులను పూర్తి చేసి, వాటిని నూతన హంగులు అద్దే యత్నం చేయకుండా నిర్లక్ష్యంగా వదిలేసింది.

తాగునీటి ఎద్దడి

పాఠశాలలో తీవ్రమైన తాగునీటి ఎద్దడి నెలకొంది. 2017లో ఏర్పాటుచేసిన వాటర్ ప్లాంటు మరమ్మతులకు గురైంది. అప్పటి నుంచి మరమ్మతులకు నోచలేదు. దీంతో విద్యార్థులు తాగునీటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత కొద్ది నెలలుగా బయటి వాటర్ ప్లాంట్ల నుంచి తాగునీటి క్యాన్‌లను తీసుకొచ్చి ప్రాంగణంలో అందుబాటులో ఉంచుతున్నారు. ఆ నీటినే విద్యార్థులు తమ దాహార్తికి వినియోగించుకుంటున్నారు. ఇక విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా మరుగుదొడ్లు లేవు. బాలికలకు ఆరు, బాలురకు ఐదు మరుగుదొడ్లు ఉన్నాయి. సిబ్బందికి అదనంగా రెండు మరుగుదొడ్లు ఉన్నాయి. అయితే వీటి నిర్వహణ అస్తవ్యస్తంగా ఉంది. అక్కడి పరిసరాలు తీవ్రమైన దుర్గంధం వెదజల్లుతుండటంతో అత్యవసర వేళ ఇబ్బందులు పడాల్సి వస్తోందని విద్యార్థులు వాపోతున్నారు. ఇక మధ్యాహ్న భోజన పథకం నిర్వహించే షెడ్డు కారుతోంది. చిన్న వర్షానికి సైతం షెడ్డు లోపల తడిచిపోవడంతో కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. భోజనాలు వడ్డన ఆరుబయట జరుగుతుండటంతో చెట్ల కొమ్మలు, పువ్వులు, పురుగులు పడుతున్నాయని, తినడానికి అసౌకర్యంగా ఉంటుందని విద్యార్థులు వాపోతున్నారు. విద్యాశాఖ అధికారులు సమస్యలపై దృష్టి సారించి పరిష్కరించాలని కంకిపాడు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు కోరుతున్నారు.



మరమ్మతులకు గురైన ఆర్ఓ ప్లాంటు



అధ్వానంగా ఉన్న మరుగుదొడ్లు

జ్ఞాన జ్యోతిని వెలిగించేవాడే గురువు



వివిధ రంగాలకు చెందిన ప్రముఖులను సత్కరించిన నిర్వాహకులు

విజయవాడ కల్చరల్: గురు సంప్రదాయాన్ని కాపాడుకోవాలని సంస్కార భారతి రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పీవీఎస్ కృష్ణ అన్నారు. గురుపౌర్ణమి సందర్భంగా సంస్కార భారతి మహానగర్ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని కౌతా పూర్ణానందం కళావేదికపై సాంస్కృతిక కళా ప్రదర్శనలు, వివిధ రంగాల్లో విశేష కృషి చేసిన వారికి గురు సత్కారం శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమాలను ప్రారంభించిన పీవీఎస్ కృష్ణ మాట్లాడుతూ సంస్కార భారతి సాంస్కృతిక, కళా, సాహిత్య రంగాలకు విశేషమైన సేవలను అందిస్తుందని చెప్పారు. సంస్కార భారతి నగర అధ్యక్షుడు పసుమర్తి భాస్కరశర్మ మాట్లాడుతూ జ్ఞాన జ్యోతిని వెలిగించేవాడు గురువన్నారు. విశ్వహిందూ పరిషత్ కోశాధ్యక్షుడు వి.దుర్గాప్రసాద్, విద్యావేత్త బోని సురేష్, వేదచారిటబుల్ సంస్థ ప్రధాన కార్యదర్శి డాక్టర్ యడ్లపాటి శేషసాయి, హైకోర్ట్ న్యాయవాది వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. సాయిశంకర్, శ్రావణ్‌కుమార్ నిర్వహించారు. సంస్కారభారతి నగర బాధ్యులు పాల్గొన్నారు. గురుపూజోత్సవం సందర్భంగా చిట్టా వెంకట ప్రసాద్(నాటక రంగం), గండూరి శ్రీనివాస మూర్తి(సంగీతం), డాక్టర్ రామకృష్ణ(సాహిత్యం) డాక్టర్ చలికాండ ఉషామాధవి(నృత్యం), ఎస్.ప్రభాకర మల్లికార్జునరావు(చిత్రలేఖనం)ను సత్కరించారు. సంస్కార భారతి యువ కళాకారులు ప్రదర్శించిన అంశాలు ఆకట్టుకున్నాయి.

యువతతోనే దేశాభివృద్ధి సాకారం



విద్యార్థులను అభినందిస్తున్న డాక్టర్ రాజ్‌గోపాల్, ప్రిన్సిపల్ జె.వందన

గన్నవరం రూరల్: దేశాభివృద్ధికి యువత సహకారం ఎంతో ముఖ్యమని డాక్టర్ సి.శోభనాద్రి సిద్ధార్థ స్కూల్ ఆఫ్ కాలేజ్ ఆఫ్ నర్సింగ్ కళాశాల కన్వీనర్ డాక్టర్ ఎస్.రాజగోపాల్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని చిన అవుటపల్లి కళాశాల ప్రాంగణంలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యాన విద్యార్థులకు అభినందన నిర్వహించారు. హర్యానాలోని ఎల్లెనాబాద్‌లో ఈ నెల నాలుగు నుంచి ఏడో తేదీ వరకు దివ్య యువమంచ్ నాలుగవ అంతర్జాతీయ సదస్సు జరిగింది. ఈ సదస్సుకు కళాశాల నుంచి నర్సింగ్ విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు డి.శ్రీ రిషిత, ఝాన్సీ రాణి, అనూష, హాజరయ్యారు. ఐక్యరాజ్య సమితి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు సాధించడానికి, యువతకు సాధికారత కల్పించడమే లక్ష్యంగా కొనసాగిన సదస్సులో తమ కళాశాల విద్యార్థులు పాల్గొనడం గర్వకారణమని కన్వీనర్, ప్రిన్సిపల్ జె.వందన పేర్కొన్నారు. ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ ప్రశాంతిని అభినందించారు.